



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 154 | శుక్రవారం 14 నవంబరు 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

## ఢిల్లీ పేలుళ్లపై అఖిలపక్ష సమావేశం : కాంగ్రెస్

**న్యూఢిల్లీ , సూర్యవాస్తవం:** దేశ రాజధాని న్యూఢిల్లీలో ఎర్రకోట వద్ద చోటుచేసుకున్న పేలుడు ఘటనపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు ముందుగానే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించాలని కోరింది. కాంగ్రెస్ పార్టీ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా గురువారం నాడు పాత్రికేయులతో మాట్లాడుతూ..జమ్ముకాశ్మీర్‌లో పహల్గాం ఉగ్రదాడి తర్వాత

- మిగతా 2లో..



## కాశ్మీర్‌లోని ప్రతి ముస్లిం ఉగ్రవాది కాదు

### జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్, సూర్యవాస్తవం :** దేశ రాజధాని ఢిల్లీలో పేలుడు ఘటనను జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తీవ్రంగా ఖండించారు. అయితే దేశవ్యాప్తంగా ముస్లింపై విద్వేషంతో కూడిన తప్పుడు ప్రచారాలను మానుకోవాలని ఆయన హితవు పలికారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. కాశ్మీర్‌లో నివసించే ప్రతీ పౌరుడు ఉగ్రవాది కాదని, కొందరు దుండగులు మాత్రమే శాంతికి

2 లో



### సీఐఐ సదస్సుకు ఒక్కరోజు

## ముందే భారీగా ఒప్పందాలు

- 35 సంస్థలతో ఎంఓయులకు నిర్ణయం
- రెన్యూ పవర్ సంస్థతో రూ.62 వేల కోట్లకు ఒప్పందం



**విశాఖపట్నం, సూర్యవాస్తవం:** ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సిఐఐ సదస్సుకు ఒక్క రోజు ముందే వివిధ సంస్థలతో చర్చల ప్రక్రియను చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఒప్పందాలు కుదుర్చుకుంది. బుధవారం సాయంత్రానికే విశాఖపట్నం చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ వెంటనే స్వయంగా చర్చల్లో భాగస్వాములయ్యారు. గురువారమంతా ఇదే ప్రక్రియ సాగింది. ఫలితంగా 35 సంస్థలతో ఎంఓయులు కుదుర్చుకోవడానికి నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్రప్రభుత్వ అధికారులు ప్రకటించారు. గురువారం

- మిగతా 2లో..

## రాష్ట్రాభివృద్ధికి విజన్



- 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో గూగుల్ డేటా సెంటర్ రాక
- విశాఖ ఎకనామిక్ రీజియన్ సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**విశాఖ పట్టణం, సూర్యవాస్తవం:** రాష్ట్రాభివృద్ధి కోసం ఓ విజన్ తయారు చేసి అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. దేశంలోని నాలుగు నగరాలకు విజన్ తయారు చేయాలని కేంద్రం నిర్దేశించిందని, వాటిలో ముంబై, వారణాసి, సూరత్, విశాఖ ఉన్నాయని తెలిపారు. ఎపి అభివృద్ధికి ప్రధాని సహకారం పుష్కలంగా ఉందని వివరించారు. గురువారం సాయంత్రం విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ డాక్యుమెంట్‌ను నీతి ఆయోగ్ సిఇఒ సుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన సంయుక్తంగా ఆవిష్కరించారు. చంద్రబాబు మాట్లాడుతూ.. విశాఖ అత్యంత నివాస యోగ్య నగరమని పేర్కొన్నారు. 2038కి భారత్ రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని, 2047కు అగ్రస్థానంలోకి రావడాన్ని ఎవరూ ఆపలేరన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రాన్ని, దాని అభివృద్ధిని సర్వనాశనం చేశారని విమర్శించారు. కూటమిగా ప్రజల మద్దతుతో పునర్నిర్మాణం చేస్తున్నామని చెప్పారు. రూ.2.66 లక్షల కోట్ల ఎంఒయులను సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ కంటే ముందే చేసుకున్నామని తెలిపారు. 17 నెలల్లోనే రాష్ట్రానికి 20 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురాగలిగామని వివరించారు. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో గూగుల్ డేటా సెంటర్ వస్తోందని, అనకాపల్లిలో దాదాపు రూ.లక్ష కోట్లతో స్టీల్‌ప్లాంట్ రానుందని చెప్పారు. తొమ్మిది జిల్లాలతో ఏర్పాటు చేస్తున్న విశాఖ ఎకనామిక్ రీజియన్ భవిష్యత్.. ఆర్థిక శక్తిగా ఆంధ్రప్రదేశ్‌ను నిర్దేశించే మోడల్‌గా నిలువనుందని పేర్కొన్నారు. విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్, సుస్థిర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విశాఖపట్నం ఇండస్ట్రియల్ రీజియన్ (విఇఆర్) మాస్టర్ ప్లాన్ - 2040కు రూపకల్పన చేశామని, తూర్పుతీరంలో విఇఆర్ దేశ ఆర్థిక ప్రగతికి గేట్‌వేగా పనిచేస్తుందని చెప్పారు. తొమ్మిది జిల్లాలతో కూడిన విశాఖ ఎకనామిక్ రీజియన్‌కు అన్ని వనరులూ ఉన్నాయని, ఈ రీజియన్ అథారిటీకి చైర్మన్ హోదాలో తానే స్వయంగా అభివృద్ధిని పర్యవేక్షిస్తానని తెలిపారు.

## మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై కేసు

- అటవీ భూముల ఆక్రమణ వీడియో విడుదల చేసిన పవన్ కల్యాణ్
- విచారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

**అమరావతి, సూర్యవాస్తవం:** మాజీ మంత్రి, వైసిపి నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కేంద్రంగా చిత్తూరు జిల్లా అటవీ భూముల వ్యవహారంలో కీలక మలుపు చోటుచేసుకుంది. ఆయనతోపాటు, ఆయన కుటుంబ సభ్యులపై అటవీ శాఖ కేసు నమోదు చేసింది. ఎ1గా ఎంపి మిథున్‌రెడ్డిని పేర్కొంది. విచారణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. కొద్ది రోజుల క్రితం ఈ ప్రాంతంలో ఏరియల్ సర్వే నిర్వహించిన డిప్యూటీ ముఖ్యమంత్రి, రాష్ట్ర పర్యావరణ అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ పెద్దిరెడ్డితోపాటు, ఆయన కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున అటవీభూములను ఆక్రమించారని పేర్కొంటూ గురువారం వీడియోను విడుదల చేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన విడుదల చేసిన వీడియోలో మంగళంపేట అటవీ భూములను ఆక్రమించారని, రెవెన్యూ రికార్డులను కూడా తారుమారు చేశారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర

- మిగతా 2లో..



## పరిశ్రమల చూపు ఏపీ వైపు

### - ఐటీ కంపెనీల శంకుస్థాపనలో మంత్రి లోకేష్



**విశాఖపట్నం, సూర్యవాస్తవం:** రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు కంపెనీల యజమానులు మొగ్గుచూపుతున్నారని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. విశాఖలో జరుగుతున్న సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన గురువారం మధురవాడ ఐటి సెజ్‌లో ఐదు కంపెనీలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ రూ.3,800 కోట్లతో ఏర్పాటు చేసే ఈ కంపెనీల ద్వారా సుమారు 30 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయని తెలిపారు. భారత్‌లో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అయిన గూగుల్ ఎఐ హబ్ విశాఖకు రానున్న నేపథ్యంలో ఇతర కంపెనీలూ క్యూ కడుతున్నాయన్నారు. రాష్ట్రంలో

- మిగతా 2లో..

# ఢిల్లీ పేలుళ్లపై అఖిలపక్ష సమావేశం : కాంగ్రెస్

(మొదటిపేజీ తరువాయి)

భవిష్యత్తులో భారత్‌పై జరిగే ఏదైనా ఉగ్రదాడిని యుద్ధ చర్యగా పరిగణిస్తామని అప్పట్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పుడు ఆ నిర్ణయానికి కట్టుబడే ఉన్నారా? అని ప్రశ్నించారు. వచ్చే డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాలను షెడ్యూల్ కన్నా ముందుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. తద్వారా ఢిల్లీ పేలుడు ఘటనపై పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చ జరపొచ్చని తెలిపింది. యుపిఎ హయాంలో ముంబయి ఉగ్రదాడి తర్వాత ఆ ఘటనకు బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర హోంమంత్రి శివరాజ్ పాటిల్ రాజీనామా చేశారని గుర్తుచేసింది. ప్రస్తుతం ఢిల్లీ పేలుడు ఘటనకు ఎవరు జవాబుదారీగా ఉంటారని, కేంద్ర ప్రభుత్వంలో ఎవరైనా బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఢిల్లీ పేలుడు జరిగిన 48 గంటల తర్వాత అది ఉగ్రదాడి అని కేంద్ర కేబినెట్ ప్రకటించిందని ఆయన విమర్శించారు. కేంద్ర నిఘా సంస్థలు, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఢిల్లీలోనే ఉండి నిశితంగా పర్యవేక్షిస్తున్నప్పటికీ 2,900 కిలోల పేలుడు పదార్థాలు ఫరీదాబాద్‌కు ఎలా చేరుకున్నాయని ఆయన నిలదీశారు. ఢిల్లీ పేలుడు ఘటనకు ఎవరు బాధ్యత వహిస్తున్నారో చెప్పాలని, ప్రజలు జవాబుదారీతనాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ఉగ్రదాడి జరిగిన ప్రతిసారీ తాము ప్రభుత్వాన్ని అండగా నిలిచామని పవన్ గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా అలాగే కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఉంటామన్నారు. కానీ ఉగ్రదాడి ఎవరి వైఫల్యం వల్ల జరిగింది? దానికి ఎవరు బాధ్యత వహిస్తారు? అనే ప్రశ్నలు లేవనెత్తడం తమ బాధ్యత అన్నారు.

# కాశ్మీర్‌లోని ప్రతి ముస్లిం ఉగ్రవాది కాదు

(మొదటిపేజీ తరువాయి)

విఘాతం కల్గిస్తున్నారని, అలాంటి దుండగులు ఎక్కడైనా ఉంటారని ఆయన తెలిపారు. ఢిల్లీ పేలుడుకు భద్రతా వైఫల్యమే కారణమన్న ఆయన, దీనికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. 'ఏ మతం కూడా అమాయకులను దారుణంగా చంపడాన్ని ఒప్పుకోదు. జమ్ముకాశ్మీర్‌లో నివసించే ప్రతి ఒక్కరూ ఉగ్రవాది కాదు. వారికి అనుబంధంగా పనిచేయరు. ఇక్కడ ఉండే కొందరు శాంతిని, సోదరభావాన్ని నాశనం చేస్తుంటారు. ఇక్కడున్న ప్రతి పౌరుడిని, కశ్మీరీ ముస్లింలను ఉగ్రవాదులుగా చిత్రీకరించవద్దు' అని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. మరోవైపు ఉగ్రవాద మాడ్యూల్‌లో ఇప్పటివరకు జమ్ముకశ్మీర్‌లోని వేర్వేరు ప్రదేశాల నుంచి ఒక ప్రభుత్వ ఉద్యోగితో సహా 10 మందిని దర్యాప్తు బందాలు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నాయి. అనంతనాగ్, పుల్వామా, కుల్గాం జిల్లాల్లో రాత్రి తనిఖీలు నిర్వహించి వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

# పరిశ్రమల చూపు ఏపీ వైపు

(మొదటిపేజీ తరువాయి)

ఆక్వా రంగాన్ని సైతం అభివృద్ధి చేయనున్నామని తెలిపారు. నాడు సిఎం చంద్రబాబు హైదరాబాద్‌ను ఎలా అభివృద్ధి చేశారో అలానే ఎపిని చేసి చూపించనున్నామన్నారు. త్వరలోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. లోకేష్ భూమి పూజ చేసిన కంపెనీల్లో సైల్స్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్, ఐస్పేస్ సాఫ్ట్ వేర్, టెక్ తమ్మిన, ఫీనోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్, కె రహేజా మిక్స్‌డ్ డెవలప్‌మెంట్ స్పేస్, కపిల్ గ్రూప్ వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఉన్నాయి. ఆయా కార్యక్రమాల్లో ఎంపి శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, లోకం మాధవి, ఎపిఐఐసి చైర్మన్ మంతెన రామరాజు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గైక్వాడ్ సెంచరీ

## దక్షిణాఫ్రికా-ఎపై ఇండియా-ఎ గెలుపు

**రాజ్‌కోట్ సూర్యవాస్తవం:** దక్షిణాఫ్రికా-ఎతో జరిగిన తొలి అనధికారిక వన్డేలో ఇండియా-ఎ జట్టు ఘన విజయం సాధించింది. దక్షిణాఫ్రికా-ఎ జట్టు నిర్దేశించిన 286పరుగుల భారీ లక్ష్యాన్ని టీమిండియా 49.3 ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్(117), అభిషేక్ శర్మ(31) తొలి వికెట్‌కు 64పరుగులు జతచేసి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత కెప్టెన్ తిలక్ వర్మ(39) ఫర్వాలేదనిపించినా.. రియాన్ పరాగ్(8), వికెట్ కీపర్ ఇషాన్ కిషన్(17) నిరాశపరిచారు. చివర్లో తెలుగుతేజం నితీశ్ కుమార్ రెడ్డి(37)కి తోడు నిషాంత్ సద్ధు(29), హర్షిత్ రాణా(6) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. దక్షిణాఫ్రికా బౌలర్లు టియాన్, ఫోర్చ్యూన్‌కు రెండేసి బార్ట్‌మన్‌కు ఒక వికెట్ దక్కాయి. అంతకుముందు ఇండియా-ఎ బౌలర్లు రాణించడంతో దక్షిణాఫ్రికా-ఎ జట్టు 53పరుగులకే 5వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో ఫోరెస్టర్(77), డిలానో(90), ఫోర్చున్(59) అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో దక్షిణాఫ్రికా-ఎ జట్టు 50ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 285పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఇండియా-ఎ బౌలర్లు అర్ష్‌దీప్, హర్షిత్ రాణాకు రెండేసి, ప్రసిధ్, నిషాంత్, రియాన్ పరాగ్, నితీశ్ కుమార్ రెడ్డిలకు ఒక్కో వికెట్ దక్కాయి. ఇరుజట్ల మధ్య రెండో వన్డే ఆదివారం జరగనుంది.

# సీఐఐ సదస్సుకు ఒక్కరోజు ముందే భారీగా ఒప్పందాలు

(మొదటిపేజీ తరువాయి)

సాయంత్రానికే వీటిలో ఆరు సంస్థలతో ఒప్పందాల ప్రక్రియ పూరయ్యింది. మిగిలిన సంస్థలతో కూడా రాత్రిలోగా ఒప్పందాలను పూర్తి చేస్తామని అధికారులు ప్రకటించారు. వీటిలో సిఆర్డిఎకు సంబంధించి ఎనిమిది, ఇంధనరంగంలో ఐదు, ఫుడ్ ప్రాసెసింగ్లో నాలుగు, మౌళికాభివృద్ధి రంగంలో మూడు, పరిశ్రమల రంగంలో తొమ్మిది ఒప్పందాలు ఉన్నాయి. రెన్యూ పవర్ సంస్థతో రూ.62 వేల కోట్ల పెట్టుబడులకు సంతకాలు చేసుకున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ముందస్తు ఒప్పందాల్లో ఇదే పెద్దదని అధికారులు చెబుతున్నారు. అలాగే ఇ జౌల్ సంస్థతో మరో రూ.19 వేల కోట్ల పెట్టుబడిపై ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే తైవాన్ దేశానికి చెందిన ప్రయివేటు ఇండస్ట్రియమ్ పార్క్‌తో రూ.1200 కోట్ల, కోరమాండల్ సంస్థతో రెండు వేల కోట్లు, హీరో ఫ్యూచర్ ఎనర్జీ సంస్థతో 15 వేల కోట్లతో, జూల్ సంస్థతో రూ.1500 కోట్లతో ఒప్పందాలు జరిగాయి.

**రెన్యూతో బాబు, లోకేష్ చర్చలు**

పవర్ సెక్టార్లో కీలకమైన రెన్యూ సంస్థతో నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి శాఖ మంత్రి లోకేష్ చర్చించారు. రాష్ట్రంలో రూ.82 వేల కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ సిఇఒ సుమంత్ సిన్హా సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆ వెంటనే ఇందుకు సంబంధించి రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం కూడా చేసుకున్నారు. తక్కువ ధరకే విద్యుత్ను విని యోగదారులకు అందించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా చంద్రబాబు సిన్హాకు వివరించారు. గూగుల్ డేటా విశాఖ వస్తున్న నేపథ్యంలో అందుకు అవసరమైన విద్యుత్ డిమాండ్ను తీర్చేందుకు తాము సిద్ధమని సిన్హా ముఖ్యమంత్రికి చెప్పారు. అనంతరం మీడియా ప్రతినిధులతో చంద్రబాబు, లోకేష్ మాట్లాడుతూ రెన్యూ పవర్ గతంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిందని, తిరిగి ఇప్పుడు వస్తున్నదని చెప్పారు. రెన్యూ పవర్ ఆధ్వర్యాన అనంతపురంలో దేశంలోనే అతి పెద్దదైన 2.8 గిగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. రైతులతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేసే ఆలోచన కూడా రెన్యూ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీనిపైనా సిన్హాతో ముఖ్యమంత్రి చర్చించారు.

**4 గిగావాట్లకు ఒప్పందం**

విద్యుత్ రంగంలోనే మరో నాలుగు గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. అనకాపల్లిలో టాయ్ పార్కు ఏర్పాటుచేసేందుకు పాల్స్ ఫ్లష్ సంస్థ, రామాయపట్నం వద్ద ఫర్నీచర్ క్లస్టర్ సిటీని ఏర్పాటుచేసేందుకు స్వీడన్కు చెందిన జూల్ గ్రూప్ సంస్థలు ముందుకు వచ్చాయి.

# మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై కేసు

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి మండలి సమావేశంలోనూ పవన్ కల్యాణ్ ఈ విషయాలను ప్రస్తావించిన విషయం తెలిసిందే. తాజాగా వీడియోను సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయడంతో పాటు, తక్షణమే విజిలెన్స్ నివేదిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పవన్ కల్యాణ్ ఈ ఆదేశాలు జారీచేసిన కాసేపటికే అటవీశాఖ రంగంలోకి దిగింది. చిత్తూరు జిల్లా పులిచెర్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. భారత న్యాయసంహిత ప్రకారం రాష్ట్ర అటవీ చట్టంలోని 61(2), 20(1), (డి)(2), 52(డి) ప్రకారం కేసులు నమోదు చేసింది. ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఎ1గాను, ఎ2గా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎ3గా పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, ఎ4గా పెద్దిరెడ్డి ఇందిరమ్మ పేర్లను నమోదు చేశారు. గురువారం సాయంత్రం అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చలపతిరావు నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ కేసులో అటవీచట్టం ప్రకారం ప్రిలిమినరీ అఫెన్స్ రిపోర్టు (పిఒఆర్) ప్రకారం ఛార్జిషీటు దాఖలు చేశామని పేర్కొన్నారు. 1968 గెజిట్ ప్రకారం మంగళంపేట అటవీ ప్రాంతంలో 75.74 ఎకరాలకు పట్టాలు ఉన్నాయని వివరించారు. అదనంగా 32.63 ఎకరాల అటవీ భూమిని కూడా కలిపేసుకొని కంచె వేశారని తెలిపారు. ఆ అటవీ భూముల్లో ఉద్యాన పంటలు వేసి సాగు చేసి ఆదాయం పొందారని పేర్కొన్నారు. చట్ట విరుద్ధంగా బోర్ వెల్ తవ్వారని, అటవీ వనరులు దుర్వినియోగం చేశారని తెలిపారు. ఈ చర్యల కారణంగా దాదాపు రూ.1.26 కోట్ల విలువైన అటవీ సంపదకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అటవీ భూములు ఆక్రమించిన ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని, వారికి సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అటవీ భూముల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టాలని మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారని తెలిపారు. సర్వే మొత్తం పూర్తిచేసి స్థలాల వివరాలను వెబ్‌సైట్‌లో పెడతామని వెల్లడించారు.

# ఎస్కార్ట్ ఆఫీసర్లను పెడతాం

- పారిశ్రామిక వేత్తలకు ఇబ్బంది లేకుండా చూస్తాం
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో యుద్ధప్రాతిపదికన అనుమతులుద
- ప్రాధాన్యతా రంగాల అభివృద్ధికి ప్రణాళికలు
- ఇండియా - యూరప్ బిజినెస్ పార్టనర్‌షిప్ రౌండ్ టేబుల్ సమావేశంలో చంద్రబాబు

**అమరావతి, సూర్యవాస్తవం**

'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేసి యుద్ధప్రాతిపదికన కేవలం 45 రోజుల్లోనే ఎపిలో కంపెనీలకు అనుమతులు ఇస్తున్నామని, త్వరితగతిన ఉత్పత్తి చేసేలా ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గూగుల్ డేటా సెంటర్ కూడా రెండు, మూడు రోజుల్లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించబోతోందన్నారు. పెట్టుబడులతో ముందుకు వస్తే చాలు.. ఎస్కార్ట్ ఆఫీసర్‌ను నియమించి పరిశ్రమలు ఏర్పాటు చేసేలా సహకరిస్తామని ప్రకటించారు. గురువారం విశాఖలో ఇండియా - యూరప్ బిజినెస్ పార్టనర్‌షిప్ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సుస్థిరాభివృద్ధిలో భారత్ - యూరప్ దేశాల మధ్య సహకార భాగస్వామ్యంపై ఈ సమావేశంలో చర్చించారు. ఆర్మేనియా ఆర్థిక వ్యవహారాల మంత్రి గివార్గ్ పాపాయాన్, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, జర్మనీ, అర్మేనియా తదితర దేశాల ప్రతినిధులు, భారత్ ఫోర్జ్ వైస్ చైర్మన్ అమిత్ కల్యాణి సహా వివిధ కంపెనీల చైర్మన్లు, సిఇఒలు, సిఐఐ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంతోపాటు.. ఇంటరాక్షన్ సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ అంశాలపై మాట్లాడారు. ప్రపంచ మార్కెట్లో ప్రవేశించడానికి ఆంధ్రప్రదేశ్ గేట్ వేగా ఉంటుందని తెలిపారు. పారిశ్రామిక ఉత్పత్తులు, విద్య, వైద్యం, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులకు అవకాశముందని తెలిపారు. ప్రకృతి సేద్యంతో పండించిన అరకు కాఫీ ఇప్పుడు గ్లోబల్ బ్రాండ్‌గా మారిందని తెలిపారు. ఎపిలో ఉన్న




అవకాశాలను పరిశీలించి ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని యూరప్ దేశాల పారిశ్రామికవేత్తలను కోరారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అగ్రస్థాయి దేశంగా మారనుందని, అందులో ఎపి ముందుంటుందని తెలిపారు. రాబోయే కాలంలో ఏయే రంగాలకు ప్రాధాన్యత ఉంటుందో గుర్తించి, ఆయా రంగాల్లో అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని సిఎం వివరించారు. విశాఖ అద్భుతమైన సాగర తీర నగరమని, మంచి వనరులు ఈ ప్రాంతంలో ఉన్నాయని, అమెరికా వెలుపల గూగుల్ అతిపెద్ద ఎఐ డేటా సెంటర్‌ను విశాఖలోనే ఏర్పాటు చేస్తోందని తెలిపారు. సబ్ సీ కేబుల్ కూడా ఈ ప్రాంతం నుంచే ఏర్పాటవుతోందన్నారు.

**త్వరలో స్పేస్ సిటీ ఏర్పాటు**

గతంలో ఐటిని ఆంధ్రప్రదేశ్‌లో ప్రోత్సహించామని చంద్రబాబు తెలిపారు. మారిన పరిస్థితుల్లో జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయని, వాటికి అనుగుణంగా సంపద పెరగాల్సి ఉందని తెలిపారు. త్వరలో స్పేస్ సిటీని ఎపిలో ఏర్పాటు చేయనున్నామన్నారు. గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత పెరిగిందని, సౌర, పవన, పంప్డ్ ఎనర్జీ రంగాల్లో ఎపి బలంగా ఉందని తెలిపారు.

# సత్యసాయి బాబా జయంతి వేడుకలకు పటిష్ట బందోబస్తు



- బాబా వేడుకల్లో పాల్గొననున్న రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని
- పట్టణంలో భారీ బందోబస్తుతో పాటు ప్రత్యేక నిఘా
- అణువణువు తనిఖీల్లో నిమగ్నమైన పోలీసులు
- బందోబస్తులో మాట్రిక్స్ కెమెరాలతో పాటు హై క్వాలిటీ డ్రోన్స్ వినియోగిస్తున్నామన్న ఎస్పీ సతీష్ కుమార్



**శ్రీ సత్య సాయి బ్యూరో సూర్య వాస్తవం నవంబర్ 13:** నవంబర్ 19 వ తేదీన భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, 22, 23 వ తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ పుట్టపర్తిలో జరిగే శ్రీ భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనేందుకు వస్తున్న సందర్భంగా, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. గత వారం రోజుల నుండి పుట్టపర్తి పరిసర ప్రాంతాలలో ప్రత్యేక పోలీస్ బృందాలు అణువణువు తనిఖీలు చేస్తున్నడంతో పాటు, రాత్రి వేళల్లో నైట్ డ్రోన్లతో ప్రత్యేక నిఘా చేపట్టారు, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఐపీఎస్, గత వారం రోజుల నుండి రాత్రింబవళ్లు వివిఐపీలు, వీఐపీలు పర్యటించే ప్రాంతాలలో స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తుండడంతో పాటు పుట్టపర్తి పట్టణంలోని విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పుట్టపర్తి సమీప ప్రాంతాలలో జిల్లా ఎస్పీ స్వయంగా పర్యటించి అక్కడ తీసుకోవాల్సిన భద్రతాపరమైన అంశాలపై అధికారులకు సూచనలు చేస్తున్నారు, ఇప్పటికే పుట్టపర్తి పట్టణ పరిసర ప్రాంతాలలో మ్యాట్రిక్స్ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలోకి వచ్చి వెళ్లే ప్రతి ఒక్కరి వివరాలు అందులో నమోదు అవ్వడం జరుగుతుందన్నారు, ఇంతేకాకుండా గ్రేహౌండ్స్ సాయిధ బలగాలు, స్పెషల్ పార్టీ పోలీసులు, బాంబు స్క్వాడ్ తనిఖీ బృందాలు పుట్టపర్తి పట్టణం మరియు పరిసరాలపై ప్రత్యేక నిఘా ఉంచి, ప్రముఖుల పర్యటనకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ విస్తృత తనిఖీలు చేపట్టారు, ప్రధాని, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పర్యటించే ప్రదేశాలు విమానాశ్రయం, హెలిప్యాడ్, రోడ్డు మార్గం, ప్రశాంతి నిలయంలోని శ్రీ భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలకు ఏర్పాటుచేసిన ప్రాంతాలు, సాయి కుల్వంత్ హాల్, హిల్ యు స్టేడియంలో ఎస్పీ పర్యటించి పరిసరాలను స్వయంగాపరిశీలిస్తున్నారు. అంతే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి పుట్టపర్తికి వచ్చే వాహనాలు, ప్రధాన రహదారులలో చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించడం తోపాటు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సేఫ్ హౌస్ మొదలగు ప్రాంతాలలో పర్యటించి భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తీసుకోవలసిన ముందస్తు చర్యలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ అన్ని ఏర్పాట్లను జిల్లా ఎస్పీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

## కంట్రోల్ రూమ్ విధుల నిర్వహణపై
# అవగాహన కలిగి ఉండాలి

- ❖ జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్
- ❖ భద్రతకు సంబంధించి అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి
- ❖ జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్



**శ్రీ సత్య సాయి బ్యూరో సూర్య వాస్తవం నవంబర్ 13:** పుట్టపర్తి లో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ లో విధుల నిర్వహణపై సిబ్బంది అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ పేర్కొన్నారు,భగవాన్ శ్రీ సత్యసాయి జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేయమన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ లో విధుల నిర్వహణపై గురువారం పుట్టపర్తి లోని గణేష్ సర్కిల్ వద్ద వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులకు ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ కంట్రోల్ రూమ్ యొక్క ప్రధాన ఉద్దేశ్యం... ప్రజా భద్రతను మరింత మెరుగుపరచడం మరియు యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచి భక్తి అనుభవాన్ని అందించడం అన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ లో 24-7 ప్రకారం విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీటీవీ ఫీడ్ మరియు డ్రోన్ సహాయంతో సేకరించిన సమాచారాన్ని ఆధారంగా గుర్తించిన సమస్యలను తగిన ప్రతిస్పందన బృందాలకు (భద్రత, వైద్య, తదితర) స్వయంచాలకంగా బదిలీ చేయడం, కమ్యూనికేషన్‌ను క్రమబద్ధీకరించడం, సత్వర మరియు సమర్థవంతమైన చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

మొత్తం 176 సీసీటీవీ కెమెరాలు మరియు 8 డ్రోన్లను ఏర్పాటు చేస్తున్నారని, సుమారు 100 మంది సిబ్బందితో మూడు షిఫ్టులుగా అధికారులు విధులు నిర్వహించాలని కలెక్టర్ మరియు ఎస్పీ పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్డీవో సువర్ణ, డీఎఫ్ఓ చక్రపాణి, వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో
# చిల్డ్రన్ పార్క్ ప్రారంభం

కోటి గళాలు ఏకమై... ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా నేడు పెనుకొండలో నిరసన గళం

- ◆ ఆహ్లాదం ఆనందానికి నిలువెత్తు నిదర్శనం పుట్టపర్తి
- ◆ చిత్రావతి నదీ తీరాన చిల్డ్రన్ పార్కును ప్రారంభించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ

**శ్రీ సత్య సాయి బ్యూరో సూర్య వాస్తవం నవంబర్ 13:** ప్రపంచ ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం భగవాన్ సత్యసాయిబాబా నడయాడిన పుట్టపర్తిలో... శతజయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం చిత్రావతి నది తీరాన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, సత్యసాయి సెంటర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ ఆర్జే రత్నాకర్, జోయలుక్కాస్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ జాలీ జాయ్‌అలుక్కాస్ లతో కలిసి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ ప్రారంభించారు,ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ... శ్రీ సత్యసాయి బాబా లవ్ ఆల్ సర్ ఆల్ అనే నినాదంతో ప్రపంచ మానవాళికి ప్రేమ స్వరూపుడై భక్తుల మదిలో నిలిచి ఉంటారన్నారు. పుట్టపర్తికి వచ్చే భక్తులకు ప్రభుత్వం తరపున అన్ని సౌకర్యాలను సమకూర్చమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని చెప్పారు. జాయ్‌అలుక్కాస్ గ్రూప్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి ఎస్ ఆర్) క్రింద ?1.20 కోట్ల నిధులతో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా యొక్క గ్రాండ్ సెంటెనరీ సెలబ్రేషన్స్ సన్నాహాల్లో భాగంగా పుట్టపర్తిలో అద్భుతమైన శ్రీ సత్యసాయి పార్క్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. బాబా శతజయంతి వేడుకలకు దేశ విదేశాల నుంచి పుట్టపర్తికి భక్తులు వస్తారని అలాంటి సందర్భంలో జోయఅలుకాస్ వారు ఇక్కడ పార్కును ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని.. పుట్టపర్తికి వచ్చే పర్యాటకులకు ఈ పార్క్ మంచి అనుభూతినిస్తుందని తెలియజేశారు,ఆ తర్వాత ముఖ్య అతిథిగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధుర రెడ్డి, మాట్లాడుతూ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించి అన్ని సదుపాయాలు సమకూర్చడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని, సత్య సాయి బాబా తన బోధనలతో ప్రపంచ దేశాలను పుట్టపర్తి వైపు చూసేలా చేశారన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి అందించిన డివైన్ లవ్ సేవాస్ఫూర్తి ప్రేమతత్వము ప్రతి ఒక్కరి మధ్యలో నిలిచిపోయాయని, బాబా చూపిన బాటలోనే పుట్టపర్తిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. జాయ్‌అలుక్కాస్ వారు అడిగిన వెంటనే కోటి 20 లక్షలతో చిత్రావతి నది ఒడ్డున మంచి ఆహ్లాదకరమైన ప్రదేశంలో పార్కులు ప్రారంభించుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందని చెప్పారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డిమాట్లాడుతూ సత్య సాయి బాబా తన సేవాస్ఫూర్తితో విద్య వైద్యము త్రాగునీరు పేదలకు అందించారని ఆయన సేవలు మరవరానివని, శత జయంతి ఉత్సవాలలో పుట్టపర్తికు వచ్చే భక్తులకు ఈ పార్కు ఈ చిత్రావతి బ్యూటిఫుల్ ఎంతగానో ఆకట్టుకుంటుందని తెలియజేశారు. అనంతరం ఈ సందర్భంగా మొక్కలు నాటారు, ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# సమర్థవంతంగా సేవలందించండి

- జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ
- ఉమ్మడి జిల్లాలో 10 మంది ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి
- మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు అందించిన చైర్ పర్సన్
- కొత్త ఎంపీడీఓలకు గిరిజమ్మ కర్తవ్యబోధ



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం, నవంబర్ 13:** మీపై మరింత బాధ్యత పెరిగింది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సమర్థవంతంగా పని చేయండి. అభివృద్ధి, సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేయండి. మీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమర్థవంతంగా సేవలు అందించి విధి నిర్వహణలో మంచిపేరు తెచ్చుకోండి అంటూ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ కర్తవ్య బోధ చేశారు. ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న పది మంది ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో గురువారం ఉత్తర్వులు అందించారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చి, సమర్థవంతంగా సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఎంపీడీఓలుగా పదోన్నతి పొందిన వారి వివరాలు, ఏయే మండలాలు కేటాయించారనే సమాచారం ఇలా...అనంతపురం జెడ్పీలో ఏఓగా పని చేస్తున్న బి.రత్నాబాయిని పెద్దపప్పూరు ఎంపీడీఓగా నియమించారు. కనగానపల్లి ఏఓగా పని చేస్తున్న వేంకటా చలపతిని అదే మండలానికి నియమించారు. గుడిబండ ఏఓ గంగాధర్ ను అగలి ఎంపీడీగా నియమించారు. రొద్దం ఏఓ రామ్ కుమార్ ను తనకల్లుకు, నల్లచెరువు ఏఓ రామకృష్ణను గాండ్లపెంటకు, కుందుర్పి ఏఓ హరికృష్ణ బాలాజీని చిలమత్తూరుకు, కళ్యాణదుర్గంలో పని చేసే దేవదాస్ ను గుంతకల్లుకు, కూడేరులో పని చేస్తున్న రాధాకృష్ణను విడపనకల్లుకు, గార్లదిన్నెలో పని చేస్తున్న దామోదరమ్మను హిందూపురానికి, బుక్కపట్నంలో పని చేస్తున్న అశోక్ రెడ్డిని నల్లచెరువు ఎంపీడీఓగా నియమించారు. తక్షణం తమకు కేటాయించిన స్థానాల్లో చేరిపోవాలని చైర్ పర్సన్ గిరిజమ్మ ఆదేశించారు.

# ప్రతి రైతు యూరియాని సద్వియోగం చేసుకోవాలి



**లక్కిరెడ్డిపల్లి, సూర్య వాస్తవం, నవంబర్ 13:** యూరియా అందుబాటులో ఉందని ప్రతి రైతు రబీ సీజన్లో సద్వినియోగం చేసుకోవచ్చు అని మండల టిడిపి అధ్యక్షుడు యనమల మదనమోహన్ పేర్కొన్నారు. గురువారం దప్పేపల్లి రైతు సేవ కేంద్రంలో యూరియా ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు తక్కువ కావడంతో రబీ సీజన్ కు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవతో వెలుగల్లు ప్రాజెక్టు నుంచి మండలంలోని అన్ని చెరువులకు నీరు వచ్చాయని ప్రతి చెరువు నిండుకుండలా ఉందని రైతులు పంటలు విస్తారంగా సాగు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కోనంపేట దప్పేపల్లి సర్పంచులు కేశవులు లక్ష్మీనారాయణ రైతు సేవా సిబ్బంది కృష్ణమోహన్ రెడ్డి మాజీ ఎంపీటీసీలు గోవింద్ వెంకటేష్ చిన్న గంగయ్య కావలి ఆంజనేయులు ఆనంద రెడ్డి ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై దాడులు దారుణం



**గుత్తి, సూర్యవాస్తవం, అక్టోబర్ 13:** గుత్తి మండలంలోని బిఎస్పి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్ అంబేద్కర్ విగ్రహంకు ని వాళు లర్పించి దళితుల మీద,ఆ దివాసుల మీద,నిత్యము దాడు లు జరుగుతున్నందువలన నవం బర్ 3న కూడా ప్రకాశం జిల్లా,చీ మకుర్తి మండలం బండ్లపూడి గ్రా మంలో ఏసుదాసు అనే దళితు ల మీద టీడీపీ వర్గానికి చెందిన సుబ్బారెడ్డి వర్గస్తులు అగ్రకులస్తు లైనటువంటి వారు దళితుల మీ ద కట్టలతో కొట్టడం వారు దౌర్జ న్యం ఎంతకాలం ఇలాంటివి జరు గుతాయని బీఎస్పీ పార్టీ నాయ కులు ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ.రాయలసీమ ఇన్చా ర్జ్ గద్దల నాగభూషణ.గుంటకల్ నియోజకవర్గం.అధ్యక్షుడు విజ య్.బీఎస్పీ పార్టీ నాయకుడు బండల రామాంజనేయులు,గొ జ్జపల్లి సుధాకర్.అనురాధ.గొంది పల్లి ఓబులేసు.కృష్ణ రంగయ్య, బాపనపల్లి సుంకన్న,గుత్తి కొండ య్య,బిఎస్పి పార్టీ నాయకులు దళితుల సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలు వాడటంతో జీవితాలు నాశనం

## ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వరాల రమేష్




**లక్కిరెడ్డిపల్లి, సూర్య వాస్తవం, నవంబర్ 13 :** మాదకద్రవ్యాలు వాడడం వలన జీవితాలు నాశనం అవుతాయని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వరాల రమేష్ పేర్కొన్నారు. నేషనల్ సర్వీస్ స్కీమ్ లో భాగంగా ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులుచే ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో చౌటపల్లిను దత్తకు తీసుకున్నారు. ఈ సందర్భంగా చౌటపల్లిలో మానవహారం నిర్వహించి ప్రతి ఇంటికి తిరిగి మాదకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వరాల రమేష్ మాట్లాడుతూ ముఖ్యంగా డ్రగ్స్ గంజాయి పొగాకు సారాయి వంటి మాదకద్రవ్యాల తాగడం వలన క్యాన్సర్ నోటి పుండ్లు జీర్ణాశయం పుండ్లు క్యాన్సర్ ఊపిరితిత్తులు వంటి వ్యాధులు వస్తాయని దీంతోపాటు పక్షపాతం కూడా వస్తుందన్నారు. ఎవరైనా డ్రగ్స్ అక్రమంగా విక్రయిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కి కాల్ చేయాలని ఆయన తెలియజేశారు. యువత కూడా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. బాగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ పాల్గొన్నారు.


# న్యూమోనియాను అరికడదాం

## - డీఆర్వో మధుసూదన్ రావు



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, నవంబర్ 13:** న్యూమోనియాను అరికడదాం పిల్లల బాల్యాన్ని కాపాడుదామని అన్నమయ్య జిల్లా డిఆర్ఓ మధుసూదన్ రావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో జిల్లా ఇమ్యునైజేషన్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించబడిన పోస్టర్ను డిఆర్ఓ మధుసూదనరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ... భారతదేశ ఆరోగ్య మరియు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రారంభించిన సోషల్ అవేర్నెస్ అండ్ యాక్షన్ టు న్యూట్రలైజ్ న్యుమోనియా కార్యక్రమం ముఖ్య ఉద్దేశం చిన్నపిల్లలలో నిమోనియా రాకుండా చేయడం వారికి తగిన సమయంలో టీకాలను అందించడం అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా న్యుమోనియా మరణాలను తగ్గించి పిల్లల బాల్యాన్ని కాపాడి వారి మంచి భవిష్యత్తుకు పునాది వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ప్రతి సంవత్సరం నవంబర్ నుండి ఫిబ్రవరి వరకు జరుగుతుందని, ప్రజలలో అవగాహన పెంచడం, లక్షణాలను ముందస్తుగా గుర్తించడం మరియు న్యుమోకాకల్ టీకా యొక్క ప్రాముఖ్యతతో సహా సకాలంలో వైద్య జోక్యాన్ని ప్రోత్సహించడంపై వైద్య ఆరోగ్య శాఖ వారు దృష్టి పెడతారన్నారు. ఈ కార్యక్రమం లక్ష్యం.. 2025 నాటికి బాల్య న్యుమోనియా మరణాలను 1,000 సజీవ జననాలకు 3 కంటే తక్కువకు తగ్గించడం అన్నారు."న్యుమోనియా నహీ, తో బచ్పన్ సాహి" అనే ట్యాగ్లైన్ తో కూడిన పోస్టర్ ద్వారా న్యూమోనియా పై ప్రజల్లో అవగాహన పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రవేశించిన లక్ష్యాలను చేరుకోవాలని డిఆర్ఓ ఇమ్యునైజేషన్ శాఖ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ శాఖ అధికారి ఉషశ్రీ ఆ శాఖ సిబ్బంది కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీఎస్ మరో మైలురాయిని అందుకుంది



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం నవంబర్ 13 :** అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (ఏఐటిఎస్), రాజంపేటకు ప్రతిష్ఠాత్మకమైన ది ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) కోల్కతా వారు 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 1,00,000/- గ్రాంట్-ఇన్-ఎయిడ్ మంజూరు చేశారు. ఈ నిధులు యొక్క ఆర్ అండ్ డి ఫండింగ్ పథకంలో భాగంగా అనుమతించబడ్డాయి. ఈ గ్రాంట్కు అర్హత పొందిన పరిశోధనా ప్రాజెక్ట్ శీర్షిక: "కంబషన్ సింథసిస్ ద్వారా సిల్వర్-డోప్ చేసిన అకెర్మనైట్ బయోసెరామిక్ యొక్క నిర్మాణ మరియు యాంత్రిక విశ్లేషణ". ఈ ప్రాజెక్టును ప్రధాన పరిశోధకుడిగా శ్రీ అంకిరెడ్డి మహేశ్వర్ రెడ్డి నడిపించగా, శ్రీ వెంకటేష్ వాకుచెర్ల మరియు డా. జి. సురేష్ బాబు పరిశోధనకు మార్గనిర్దేశకులుగా వ్యవహరించనున్నారు. ఈ పరిశోధనలో సిల్వర్-డోప్ చేసిన అకెర్మనైట్ బయోసెరామిక్స్పై సుదీర్ఘ అధ్యయనం జరగనుంది. సహజ ఎముక నిర్మాణాన్ని అనుకరించే అత్యుత్తమ బయోకాంపాటిబిలిటీ, శక్తివంతమైన మెకానికల్ బలం, మరియు యాంటీబాక్టీరియల్ లక్షణాలు కలిగిన ఈ పదార్థాలు ఆర్థోపెడిక్ చికిత్సల్లో ఎముక పునరుద్ధరణకు గొప్ప ఉపయోగం కానున్నాయి. కంబషన్ సింథసిస్ విధానం ద్వారా ఈ పదార్థాల మైక్రోస్ట్రక్చర్, బలం, మరియు బయోక్రియాశీలతను మెరుగుపరచడం ఈ అధ్యయన లక్ష్యం. ఈ గ్రాంట్ మంజూరు ఏఐటిఎస్ పరిశోధనాభివృద్ధిపై చూపుతున్న కట్టుబాటును, ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, బయోమెటీరియల్స్ మరియు మెటీరియల్స్ సైన్స్ రంగాలలో జాతీయ ప్రాధాన్యత కలిగిన పరిశోధనలను ప్రోత్సహించే దిశగా సంస్థ తీసుకున్న ముందడుగును స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ సందర్భంగా వైస్-చాన్స్లర్ డా. ఈ. సాయిబాబా రెడ్డి మరియు %=డణ% డీన్ డా. ఎన్. శివరామ రెడ్డి, పరిశోధనా బృందాన్ని అభినందిస్తూ, ఈ ప్రాజెక్ట్ ద్వారా విద్యార్థులు, పరిశోధకులకు లభించనున్న ప్రయోజనాలను ప్రశంసించారు. ఏఐటిఎస్ తరపున పరిశోధనా బృందానికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# సర్వీస్ రిజిస్టర్ల పంపిణీ

**లక్కిరెడ్డిపల్లి , సూర్య వాస్తవం:** నూతనంగా ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికైన ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో సర్వీస్ రిజిస్టర్లు మండల విద్యాశాఖ అధికారులు చక్రె నాయక్ మరియు వెంకటసుబ్బయ్యలు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ లు మాట్లాడుతూ నూతనంగా ఉద్యోగాన్ని పొందిన ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి ఉపాధ్యాయురాలికి అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయ వృత్తిపట్ల నిబద్ధత కలిగి విద్యార్థులకు మంచి విలువలతో కూడిన విద్యను అందించి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అన్నమయ్య జిల్లా మీడియా ఇంచార్జ్ వెంకటేశ్వర్లు, మండల నాయకులు నాగరాజు, పూజారి వెంకటేశ్వర్లు, నూతన ఉపాధ్యాయులు గంగాధర్ మరియు సావిత్రిలు పాల్గొన్నారు.



## చెన్నకేశవస్వామి కళ్యాణోత్సవం



**లక్కిరెడ్డిపల్లి, సూర్య వాస్తవం, నవంబర్ 13:** లక్కిరెడ్డిపల్లి మండలం కస్తూరి కస్తూరి రాజు గారి పల్లి గ్రామపంచాయతీ దేవలంపల్లిలో వెలిసినటువంటి శ్రీశ్రీశ్రీ చెన్నకేశవ స్వామి కళ్యాణోత్సవంలో రాయచోటి తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు లక్ష్మి ప్రసాద్ రెడ్డి మరియు లక్కిరెడ్డిపల్లి మండల ఇంచార్జ్ యనుమల మదన్ మోహన్ పాల్గొన్నారు. వేద పండితులు పూర్ణ కుబంతో వేదమంత్రాలూ తో స్వాగతం పలికి స్వామి వారి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ చెన్నకేశవ స్వామివారి ఆశీస్సులతో వర్షాలు సమృద్ధిగా పడి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని దేవుడి ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలపై ఉండి ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాపయ్య, సిద్ధక వెంకట్రాంరెడ్డి, జనార్దన్ రెడ్డి, దేవానంద రెడ్డి, మండ్ల రామాంజనేయులు,యోగంజనేయులు గ్రామ ప్రజలు, భక్తులు పాల్గున్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీ



**డోన్- సూర్య వాస్తవం, నవంబర్ 13:** డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి,సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.34,19,232 విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ డోన్ శాసనసభ్యులుకోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని, లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ చెక్కులు ప్రధానంగా ఆరోగ్య సంబంధిత చికిత్సల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 'ప్రజల అవసరాలను గుర్తించి సాయం అందించడం ప్రభుత్వ బాధ్యత. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఊరట కల్పించడం మా ప్రధాన ధ్యేయం. ప్రజల సౌఖ్యం, ఆరోగ్యం, అభివృద్ధి మా ప్రాధాన్యత" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోటపై నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌ను కలిసిన
# వైఎస్సార్సీపీ మండల కన్వీనర్

**కనేకల్, నవంబర్ 13 సూర్య వాస్తవం :** వైఎస్సార్సీపీకి బలం చేకూర్చేలా కష్టపడి పని చేసే వారికి తగిన గౌరవం, గుర్తింపు లభిస్తుందని పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అన్నారు. పార్టీ పటిష్టతకై నిరంతర కృషి చేయాలని సూచించారు.కణేకల్ మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్సీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమనలు కలిసి గురువారం తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ వారితో దీర్ఘంగా మాట్లాడారు.మండలంలో పార్టీ పరిస్థితులు, నాయకుల పనితీరు, ఇటీవల నిర్వహించిన పార్టీ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చ జరిగింది.



రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి నాయకత్వంలో 'బాబూ ష్యూరిటీ... మోసం గ్యారంటీ', 'కోటి సంతకాల సేకరణ', 'రచ్చబండ' కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమాలకు ప్రజల నుండి విశేష స్పందన లభించిందని చెప్పడంతో జగన్ ఆనందం వ్యక్తం చేశారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో చురుకుగా పని చేయాలని, ప్రజల్లో బలమైన మద్దతు ఏర్పడేలా కృషి చేయాలని జగన్ సూచించారు. టీడీపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కుట్ర, నిరుద్యోగ భృతి నిలిపివేత, ఉద్యోగ అవకాశాల లోపం వంటి అంశాలపై యువతకు అవగాహన కల్పించాలన్నారు.ప్రజా సమస్యలపై ఎల్లప్పుడూ స్పందిస్తూ, ప్రజల కోసం పోరాటం చేయడం వైఎస్సార్సీపీ కార్యకర్తల ధర్మమని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ అధికారంలోకి వచ్చిన తరువాత తగిన గుర్తింపు తప్పకుండా అందజేస్తామని భరోసా ఇచ్చారు.

# సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**కదిరి సూర్యవస్తవం నవంబర్ 13 :** కదిరి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తులు అనారోగ్య కారణాలవల్ల సీఎం సహాయనిధి ని ఆశ్రయించి దరఖాస్తు చేసుకున్న 41 మందికి గురువారం స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా లో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ దాదాపు 46 లక్షల రూపాయల చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల వైద్యానికి పెద్ద పీట వేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు అంటూ ప్రసంగించారు పేదల ఆరోగ్యం గురించి వారి యొక్క భద్రతాభావాన్ని ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ వారి వైద్య ఆరోగ్యం పరిస్థితులను



మెరుగుపరిచేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలను, వారికి నిధులను సంకూరుస్తున్నారని తెలిపారు, కాగా నేడు వైసీపీ నేతలు ధర్నాలు చేస్తూ తప్పుడు విధానాలను ప్రజలలో అపోహలను సృష్టించే విధంగా పన్నాగాలను పన్నుతున్నారని విమర్శించారు , నేడు ఉచిత బస్సులో ప్రయాణించే మహిళలకు కూడా విమర్శలకు గురి చేస్తున్నారని ,ప్రజలు వాటిని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టే ప్రయత్నాలు చేస్తారని తెలిపారు ,వైసిపి మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ కూడా ఉచిత బస్సులో ప్రయాణించవచ్చని అంతేగాని అబద్ధాలు పదేపదే చెప్తే అవి నిజాలు కావని హితవు పలికారు, ప్రజలు విజ్ఞతగా ఆలోచించి వైసిపికి 11 సీట్లకే పరిమితం చేశారని వారికి పేదల వైద్యం ,ఆరోగ్యం గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు, సమాజ హితం కోసం పనిచేస్తున్న ప్రభుత్వం బురదజల్లే ప్రయత్నాలు చేస్తే ప్రజలు మరొకసారి తిప్పి కొట్టే అవకాశం ఉందని తెలిపారు ,గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఎన్ని చెరువులకు నీళ్లు ఇచ్చారో ఆత్మ విమర్శ చేసుకోమని విమర్శించారు ఇప్పటికైనా వైసీపీ నేతలు చెత్త ఆలోచనలు, చెత్త మాటలు మానుకోవాలని హితవు పలికారు కదిరి నియోజకవర్గానికి ఇంత పెద్ద మొత్తంలో సీఎం సహాయ నిధి నిధులను విడుదల చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గంగయ్య నాయుడు, రాజశేఖర్ బాబు , తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలతో స్నేహపూర్వక
# సంబంధాలతో మెలగాలి



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, నవంబర్ 13:** జిల్లాలో నేరాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, ప్రజల భద్రతను పరివేక్షించే క్రమంలో గురువారం నాడు జిల్లా ఎస్పీ పలు పోలీస్టేషన్లను వార్షిక తనిఖీలు చేశారు.గుంతకల్లు సబ్ డివిజనల్ , గుంతకల్లు రూరల్ సర్కిల్, యాడికి పోలీసు కార్యాలయలను వార్షిక తనిఖీలు నిర్వహించారు. గుంతకల్లు సబ్ డివిజన్ మరియు గుంతకల్లు సర్కిల్ పరిధిలో నమోదైన గ్రేవ్ , నాన్ గ్రేవ్ , ప్రాపర్టీ అఫెన్సెస్ , రికవరీ శాతం, గ్రేవ్ యూ.ఐ, పి.టి, తదితర కేసులను ఎస్పీ సమీక్షించారు.ఈ తరహా కేసుల్లో ఆయా పోలీసులు ఎలాంటి పురోగతి సాధించారు, కింది స్థాయి సిబ్బందికి , అధికారులకు డీఎస్పీ ఎలాంటి సూచనలు, సలహాలు ఇచ్చారో ఆరా తీశారు.తరుచూ చోటు చేసుకుంటున్న ఫోక్సో మరియు ఎస్సీ ఎస్టీ కేసుల నియంత్రణలో భాగంగా విద్యా సంస్థలు, ఎస్సీ ఎస్టీ కేసులు అధికంగా ఉన్న గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలనీ కింది స్థాయి సిబ్బంది నుండీ డీఎస్పీ స్థాయి అధికారుల వరకు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి ఫోక్సో నేరాలు జరుగకుండా మరియు అమ్మాయిలు మోసపోకుండా చైతన్యం చేయాలనీ సూచించారు.గ్రామాల్లోని ఎస్సీ ఎస్టీ కాలనీలకు వెళ్లి చట్టాలపై అవగాహన చేయాలి. ఎస్సీ ఎస్టీలు ఎవరూ అణచివేతకు గురికాకుండా , బాధితులుగా మిగలకుండా పని చేయాలనీ మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ , తదితర అసాంఘిక కార్యకలాపాలపై గట్టి చర్యలు తీసుకోవాలని సూచనలు జారీ చేశారు.కేసుల పెండెన్సీ తగ్గించాలి. ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పెంచాలి. దొంగతనం కేసుల్లో రికవరీ సాధించాలి. రోడ్డు ప్రమాదాల నియంత్రణ మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేయాలని సుచించారు.ఈ వార్షిక తనిఖీలో తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి, ఎస్పీ సిసి ఆంజనేయ ప్రసాద్ .గుంతకల్లు డీఎస్పీ ఏ.శ్రీనివాస్ , సి.ఐ ప్రవీణ్ కుమార్, , యాడికి సి.ఐ ఈరన్న. ఎస్సై రాఘువేంద్రప్ప, సిబ్బంది పాల్గొన్నారు.





# వైభవంగా టీడీపీ పదవులు పండుగ





**కుప్పం సూర్య వాస్తవం, నవంబర్ 13:** కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగు తమ్ముళ్ల వివిధ పదవుల సంబంధించి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కొత్త కమిటీల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆ పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జిలు, కో-క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు, కో-యూనిట్ ఇన్చార్జిలు, గ్రామ పంచాయితీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, కో-బూత్ కన్వీనర్ల ప్రమాణ స్వీకారోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు కుప్పం చెరువుకట్టపై నుండి భారీ ర్యాలీగా బయలుదేరి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న నందమూరి తారకరామారావు విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం కుప్పం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సభలో కొత్త కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం, పిఎంకె ఉడా చైర్మన్ డాక్టర్ బి ఆర్ సురేష్ బాబు, రెస్కో చైర్మన్ విజీ ప్రతాప్, ఏఎంసీ చైర్మన్ జి మునిరాజు, మున్సిపల్ చైర్మన్ సెల్వ రాజు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నేతలు డాక్టర్ వెంకటేష్, కౌన్సిలర్లు జాకీర్ అహ్మద్, దాము, కన్నన్, ఏఎంసీ డైరెక్టర్లు రెస్కో డైరెక్టర్లు 4 మండలాల నూతన పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు నేతలు పాల్గొన్నారు.

# కిడ్నీ రాకెట్ ఉదంతంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్..

- ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదు..
-ఉన్నత స్థాయి కమిటీతో రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు..
-ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ వెల్లడి...



**మదనపల్లి, సూర్య వాస్తవం :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన, మదనపల్లె పట్టణ కేంద్రంగా సాగిన కిడ్నీ మార్పిడి ఆపరేషన్ ఉదంతంపై రాష్ట్ర ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. గురువారం మదనపల్లె టమాటా మార్కెట్ కిమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి విచ్చేసిన మంత్రి కిడ్నీ రాకెట్ ఉదంతం పై విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి అనుమతులు లేకుండా కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేపట్టి మహిళ ప్రాణాలు పోవడానికి కారణమైన వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. జిల్లా వైద్యాధికారిగా ఉంటూ ఇలాంటి వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వ వైద్యుడే ఇలాంటి వాటికి ఊతమిచ్చే విధంగా వ్యవహరిస్తూ స్వతహాగా ఆసుపత్రి ఏర్పాటు చేసి ఇలాంటి వాటికి కేరాఫ్ అడ్రస్ గా మారడం చాలా దురదృష్టకరమన్నారు. అతనిపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, ఇందులో ప్రమేయమున్న అందరిని కఠినంగా శిక్షిస్తామని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాన్స్ ప్లాంటేషన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ 1994 యాక్ట్ ప్రకారం కిడ్నీ మార్పిడి చేయాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అన్నారు. మదనపల్లె గ్లోబల్ ఆసుపత్రికి అలాంటి అనుమతులు లేవని, కావున ఈ సమస్యను తేలికగా తీసుకోవడం లేదన్నారు. పోలీసులు సైతం ఇప్పటికే బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారని, లోతుగా దర్యాప్తు చేస్తున్నారన్నారు. చిత్తూరు డిసిహెచ్ఎస్ ఆధ్వర్యంలో ఓ ప్రత్యేక వైద్యబృందాన్ని ఏర్పాటు చేశామని, ఈ కిడ్నీ రాకెట్ ఉదంతంపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి నివేదిక ఆధారంగా బాధ్యులపై క్రిమినల్ కేసులతో పాటు శాఖపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వైద్య వృత్తిలో ఉంటూ ఇలాంటి దురాగతాలకు పాల్పట్టడం దుర్మార్గమని అలాంటి వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని మరోసారి స్పష్టం చేశారు. ఇలాంటివి పురాతపుత్వం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత స్థాయి కమిటీతో అన్ని ఆసుపత్రులను తనిఖీలు చేపట్టి పకడ్బందీ చర్యలు తీసుకుంటామని మంత్రి సత్య కుమార్ స్పష్టం చేశారు.

# కిడ్నీ రాకెట్ ఉదంతం పై విచారణ వేగవంతం

**మదనపల్లె సూర్య వాస్తవం :** మదనపల్లె పట్టణ కేంద్రంగా సంచలనం రేకెత్తించిన కిడ్నీ రాకెట్ ఉదంతంపై రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారి చక్రధర్ రావు ఆదేశాల మేరకు.. గురువారం చిత్తూరు డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలిదేవి బృందం మదనపల్లెకు వచ్చారు. ఈ బృందంలో సీనియర్ సర్జన్ డాక్టర్ హరి గోపాల్, అనస్తీషియన్ డాక్టర్ సాయికిషోర్, ఫిజీషియన్ డాక్టర్ హమీదుల్లా, ఆఫీస్ స్టాఫ్ ఫణిభూషణ్ లు ఉన్నారు. ఈ ఐదు మంది బృందం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలపై ఆరా తీశారు. ఇక్కడ నుంచి కిడ్నీ రాకెట్ ఆపరేషన్ జరిగిన పరిణామాలపై ఆరా తీశారు. డయాలసిస్ టెక్నీషియన్ బాలరంగడు పాత్ర, కదిరి ఆస్పత్రికి చెందిన మరో డయాలసిస్ టెక్నీషియన్ మెహరాజ్ పాత్ర పై ఆరా తీశారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. డయాలసిస్ సెంటర్ నిర్వాహకులు అపోలో మేనేజర్ ముఖేష్ తో మాట్లాడి పలు వివరాలు సేకరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యులతో సమావేశమై డయాలసిస్ కేంద్రం పనితీరు, ఇక్కడికి వస్తున్న కిడ్నీ బాధితుల వివరాలను సేకరించారు. అనంతరం ఆపరేషన్ ద్వారా వైజాగ్ మహిళ యమున కిడ్నీ ని తీస్తూ



ఆమె మృతికి కారణమైన గ్లోబల్ హాస్పిటల్ ను సందర్శించారు. ఆసుపత్రిలో జరిగిన పరిణామాలపై ఆరా తీశారు. పూర్తి నివేదికను రాష్ట్ర ఆరోగ్యశాఖ అధికారులకు అందిస్తామని డిసిహెచ్ఎస్ పద్మాంజలి దేవి తెలిపారు.

# గాండ్లపెంటలో వైసీపీ కోటి సంతకాల సేకరణ

**గాండ్లపెంట, నవంబర్ 13, సూర్య వాసవం :** గాండ్లపెంట మండల కేంద్రంలోని వైయస్సార్ విగ్రహం వద్ద వైఎస్ఆర్సిపి పార్టీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. గాండ్లపెంట గ్రామ కన్వీనర్ భోగాజి రెడ్డి ఈ సందర్భంలో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కాలేజీలకు నిర్మాణానికి అడుగులు వేసిందని అందులో ఏడు మెడికల్ కాలేజీలు నిర్మాణం పూర్తికాగా అందులో ఐదు మెటికల్ కాలేజీలలో అడ్మిషన్లు కూడా ప్రారంభమయ్యాయి అని మిగతా పది మెడికల్ కాలేజీలు నిర్మాణ దశల్లో ఉన్నాయని, వైద్య విద్యను అభ్యసించాలనే పేద విద్యార్థుల కలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నదని తద్వారా నాణ్యమైన వైద్య విద్యకు పేద విద్యార్థులు దూరమవుతారని ఉద్దేశంతోనే కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి, కదిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, రవీంద్రారెడ్డి స్వామి, పామిడి బాలు ,మైనుద్దీన్ నాగరాజు, బాబుద్దీన్, ఆజాద్ నటరాజ్ ,నరేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.



# గాలివేటి శ్రీరాములు నాయుడుకి ఎమ్మెల్యే పరిటాల సునీత నివాళి



**కదిరి సూర్య వాస్తవం, నవంబర్ 13 :** కదిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు, స్థానిక శాసనసభ్యుడు కందికుంట వెంకట ప్రసాద్ కు సన్నిహితులు, పరిటాల కుటుంబ శ్రేయోభిలాషి గాలివేటి కృష్ణమోహన్ నాయుడు తండ్రి గాలివేటి శ్రీరాములు నాయుడు ఇటీవల కాలంలో మృతి చెందారు. ఈ సందర్భంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత శ్రీరాములు నాయుడు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గత వారంలో శ్రీరాములు నాయుడు మరణించగా.. గురువారం ఎమ్మెల్యే సునీత చిన్న యల్లంపల్లి గ్రామానికి వెళ్లారు. కృష్ణమోహన్ నాయుడుతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీరాములు నాయుడు కుటుంబంతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీకి ఎన్నో సేవలు అందించారని పరిటాల రవికి వారు ఎంతో ఆప్తులుగా ఉండేవారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత అన్నారు. వారి కుటుంబానికి స్థానిక శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ గారితో పాటు తాము కూడా అండగా ఉంటామని ఆమె స్పష్టం చేశారు.

# ఉచిత వైద్య శిబిరం




**గాండ్లపెంట నవంబర్ 13 సూర్య వాస్తవం:** గాండ్లపెంట మండలంలోని రెక్కమాను గ్రామం నందు గురువారం సర్పంచ్ సీఎన్ఏ సుధాకర్ మరియు శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తిరుపతి వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిఎన్ఎ సుధాకర్ మాట్లాడుతూ ఈ ఉచిత వైద్య శిబిరానికి వచ్చి ప్రజలు తమ తమ ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా ఉచిత వైద్య శిబిరానికి 160 మంది ఓపి రసీదులు తీసుకున్నారు ఇందులో 21 మందికి వివిధ రకాలైన టెస్టులు నిర్వహించి వారి ఆరోగ్య సమస్యలకు వైద్యం అందించడానికి తిరుపతికి తీసుకువెళ్లారు. వీరికి ఉచిత వైద్య ఖర్చులు మొత్తం ఎన్టీఆర్ ఉచిత వైద్య శిబిరం ద్వారా అందజేస్తామని ఆయన తెలిపారు. అదేవిధంగా ఎన్టీఆర్ ఉచిత వైద్య శిబిరానికి విచ్చేసినటువంటి శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య బృందానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# నిజాం వలీ కాలనీలో నేడు ప్రజాదర్బార్

**కదిరి, సూర్య వాస్తవం, నవంబర్ 13:** కదిరి మున్సిపల్ పరిధిలోని 11,13,14,15,16,17,వార్డులలో ప్రజా సమస్యలను నేడు నిజాం వలి కాలనీలో శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. శుక్రవారం ఉదయం 09:00 గంటల నుంచి నిజాం వలి కాలనీ సచివాలయం నందు ప్రజాదర్బార్ నిర్వహిస్తారన్నారు. పై,కార్యక్రమంలో ,టీడీపీ,బీజేపీ, జనసేన,ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, పట్టణ అధ్యక్షులు, 11,13,14,15,16,17 సంబంధించిన వార్డు కౌన్సిలర్లు,వార్డు ఇంఛార్జీలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు,ప్రజా ప్రతినిధులు, పాల్గొనవలసిందిగా కోరుచున్నాము. కావున ప్రజా సమస్యల పై వచ్చే వారు తమ సమస్యలను అర్జీ రూపంలో వ్రాసుకొని దానికి మీ ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్,మీ వివరాలు జత చేసుకుని రావలెనని తెలిపారు.

# నేడు ప్రజా దర్బార్ కార్యక్రమం

**కదిరి సూర్య వాస్తవం నవంబర్ 13**

పట్టణంలోని నిజావలి కాలనీలో కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పత్రికాముఖంగా తెలిపారు , పట్టణంలోని 11 ,13, 14, 15, 16, 17 వార్డుల కు సంబంధించిన వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జులు, క్లస్టర్, యూనిట్, భూత్ ఇన్చార్జులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని ప్రజా సమస్యలను సత్వర పరిష్కార మార్గం కోసం ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా కార్యక్రమాన్ని రూపొందించారు, కావున ప్రజలు తమ వెంట ఆధార్ కార్డు, మీ ఫోన్ నెంబర్, మీ అర్జీకి సంబంధించిన వివరాలను జత చేసుకుని రావాలని అధికారులు తెలిపారు

Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in




# రైతాంగం సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయండి

## రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం నవంబర్ 13:** పదవిని బాధ్యతగా స్వీకరించి రైతాంగం సంక్షేమం కోసం అంకితభావంతో కృషి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. గురువారం మదనపల్లిలోని నీరుగట్టపల్లి మెయిన్ రోడ్ లో గల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, రాష్ట్ర రవాణా మరియు క్రీడ యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. మదనపల్లి ప్రాంతంలో మనం ఉండడం ఎంతో అదృష్టంగా భావించాలని, దేశానికి స్ఫూర్తిని ఇచ్చిన మన జాతీయ గీతం రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లిలోని బెసెంట్ థియోసాఫికల్ కళాశాలలో బస చేసినప్పుడు జనగణమనను బెంగాలీ నుండి ఆంగ్లంలోకి అనువదించారని, యానీ బిసెంట్ కళాశాల గొప్ప చరిత్ర కలిగినదని గొప్ప ప్రాంతం మదనపల్లి అని తెలియజేశారు. ఇలాంటి ప్రాంతంలో కూటమి ప్రభుత్వ భాగస్వామ్యంతో పవన్ కళ్యాణ్ గారి నాయకత్వంలో మదనపల్లి టమేటా మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వారందరికీ అభినందనలు తెలియజేస్తూ.. అలాగే ఈరోజు ప్రమాణ స్వీకారం చేసిన వారందరూ గత పాలకులు చేసిన విధంగా కాకుండా ఒక ప్రత్యేక మార్పు తీసుకురావాలి, సమాజంలో అందరం కూడా ఆదర్శవంతంగా నిలబడాలి విధంగా పనిచేయాలని అన్నారు. ఒక మంచి ఆలోచనలు, నాయకత్వ లక్షణాలు ఉన్నటువంటి వారిని నియమించాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వంలో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి సారథ్యంలో ఈ రోజున జంగాల శివరాం కరెక్ట్ పర్సన్ గా నియమించడం జరిగిందని అన్నారు.

అదేవిధంగా ఆరు సంవత్సరాల క్రితం డిసెంబర్ మాసంలో 2019 లో ఎన్నికలు అయిపోయిన తర్వాత ఆ రోజున టమాటో రైతులు పడుతున్న కష్టాల గురించి సోదరుడు రామదాస్ చౌదరి తో మాట్లాడితే ఇక్కడ ఉన్న వాస్తవ పరిస్థితులు వివరించారని, ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగానే మనం వెళ్లి కలుద్దాం రైతుల సమస్య ఏంటో మనం కూడా తెలుసుకుందాం అని ఈ ప్రాంతాన్ని పర్యటించి రైతుల కష్టాలను తెలుసుకుని రైతాంగాని కోసం మన ప్రాంతం కోసం ఇక్కడ వాళ్ళు పడుతున్న కష్టాల కోసం కచ్చితంగా మనం నిలబడాలని ఆనాడే నిర్ణయించడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టమాటో రైతే కాదు, ఉల్లి రైతులు ఇతర రైతులకు మద్దతు ధరలు విషయమై ప్రతి వారం మీరు సమీక్షించాలని, ధరల గురించి రైతులు ఎక్కడ కూడా నష్టపోకుండా ఉండాలనే ఆలోచన ఒక కమిటీ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు మద్దతు ధర అందించే విధంగా చూడాలని ఆదేశించారు. ఒక రైతు బిడ్డగా రైతాంగం పడుతున్న కష్టాల్ని దయచేసి మీరందరూ కూడా గుర్తుపెట్టుకోవాలి. ఎందుకంటే రైతు ఎదురుచూసేది తను పండించిన పంట ద్వారా ఏదో రేపటి రోజున రియల్ ఎస్టేట్ వ్యాపారం అయిపోవాలనో లేదా ఒక పెద్ద ఫ్యాక్టరీ పెట్టాలని కోరుకోడు రైతు.. రైతు కోరుకునేది తన కుటుంబాన్ని జాగ్రత్తగా కాపాడుకుందాం అనుకుంటాడని, అలాగే పంట నష్టం కలగకుండా బిడ్డల్ని చదివించుకుందాం ఒక పండగ వస్తే కొత్త బట్టలు కొనుక్కుందాం కుటుంబానికి తనకి అనే భావన తప్ప అంతకన్నా ఎక్కువ ఏముంటదిని ఒక రైతుకి మీరు జాక్పాట్ పేరుతో రైతు ఎంత నష్టపోయారో మీరందరూ తెలుసుకోవాలని,కొత్త పాలక వర్గాన్ని నేను కోరుతున్నాను శివరాం ని, ఆంజనేయులుని ఇక్కడ ఉన్న బోర్డు సభ్యులందరినీ కూడా దయచేసి మీరు



పెద్ద మనసుతోటి ఆలోచించండి

మీరు తొందర పాటు నిర్ణయాలతో రైతులకు ఇబ్బంది పెట్టొద్దని అలాగే రైతులకు వ్యాపారస్తులకు పిలిచి మాట్లాడి వారి మధ్య సమన్వయం ఎప్పటి విధంగా చూడాలని సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఎందుకంటే ఎవరికీ నష్టం జరగకుండా అంతిమంగా రైతాంగానికి ఉపయోగపడే విధంగా మీరు వ్యవహరించాలి. ఉచితంగా మనం దీపం పథకం కింద గ్యాస్ ఇస్తున్నాం. శ్రీ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకి ఉచిత ప్రయాణాలను అందిస్తున్నామని అదే విధంగా పెన్షన్లు 2,000 ది కాస్త 4,000 పెంచి ప్రతి నెల ఒకటో తారీఖున మనం ప్రభుత్వ ఖజానా నుంచి క్యాష్ రూపంలో ఒకటో తారీఖు ఉదయమనే ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అభివృద్ధి సంక్షేమం రెండు కలిపి తీసుకెళ్లే విధంగా మీరంతా కృషి చేయాలని అన్నారు. వైద్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా గుర్తు పొందిన మదనపల్లి మండికి మరింత పేరు ప్రఖ్యాతలు తెస్తానని, మండీలో వసతులు పెంచి, రైతులు తమ పండించిన టమాటా పంటను మద్దతు ధర అందించే విధంగా, అలాగే అధిక ఎగుమతులను అందించే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మదనపల్లి టమాటో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారం చేసిన జంగాల శివరాంకి, జనసేన పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీ నుంచి ఆంజనేయులుకి, భారతీయ జనతా పార్టీ నుంచి కూడా డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన సంధ్య రాణికి ఇతర డైరెక్టర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన మదనపల్లి మండీకి మరింత పేరు ప్రఖ్యాతులు తెస్తానని కేవలం మదనపల్లి కాకుండా చుట్టుపక్కల జిల్లాలయిన అనంతపురం, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలతో పాటు కర్ణాటక నుంచి రైతులు కూడా మదనపల్లి మండీ మీద ఆధారపడి ఉన్నారని, ఇక్కడ వసతులను పెంచి మరింత సౌకర్యాలు పెంచి రైతులు పండించిన టమాట పంటలను అధిక ఎగుమతులు వచ్చే విధంగా పాలకవర్గం పనిచేయాలని తెలియజేశారు. ఏషియాలోనే అతిపెద్ద మండిగా పేరు పొందిన మదనపల్లి సగటున 1.40 లక్షల టన్నుల టమాటా ఇక్కడ ఇక్కడ ఎగుమతి అవుతున్నదని, దీనిని బట్టి ఇది ఎంత పెద్ద మార్కెట్ యార్డ్ అని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ మార్కెట్ నందు రోజుకు 400 నుండి 500 మంది నిరంతర 365 రోజులు ప్రతిరోజు ఏదో ఒక యాక్టివిటీ తో దీనిపై ఆధారపడి ఉంటారని తెలిపారు. రైతుల సౌకర్యాలు పెంచాలి. పండించిన పంట ఉత్పత్తులు బయట అమ్ముకుని విధంగా సహకరించాలి. టమాటా రేటు తక్కువ ఉన్న సమయంలో టమాటాను పౌడర్, పల్ప్ తయారు చేసుకునే విధంగా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, ఇలా ఎగుమతులు పెంచే విధంగా చూడాలని, వీటికి ప్రపంచవ్యాప్తంగా కూడా చాలా డిమాండ్ ఉందని తెలిపారు. కేవలం రైతుల తీసుకొని వచ్చే టమాటా పంటను మార్కెట్లో తీసుకోవడం అమ్మడమే కాకుండా ఇలా చేయడం వలన ఎక్కువ లాభం వస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక రకాల పథకాలను, బిందు సేద్యం, సేద్యపు యంత్ర పరికరాలను, పనిముట్లకు 50 శాతం వరకు రాయితీ, సబ్సిడీలను అందిస్తున్నదని వీటన్నింటినీ రైతులకు తెలియజేసి వారు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని కోరారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా మరియు క్రీడ యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 17 నెలల్లో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఈరోజు ప్రజలకు అందిస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మన యువ నాయకులు నారా లోకేష్ సారాధ్యంలో కేంద్రంలో నరేంద్ర మోడీ గారి ఆశీస్సులతో మనం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా ప్రతి పథకం తూచా తప్పకుండా మన ముఖ్యమంత్రి నిర్వహణ లోటు లేకుండా చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్ ఉండే సమస్యలపై అవగాహనతో పాటు సమస్యలను 16 నెలలోనే తీర్చగలిగేది విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. కూటమిలోని నాయకులందరిది ప్రజల యొక్క సంక్షేమమే లక్ష్యంగా పని చేయాలని.. ఆ లక్ష్యంతోనే మన రాష్ట్ర ముఖ్యమంత్రి కరువు ప్రాంతంగా గుర్తించబడ్డ మన జిల్లాలో నీటి సమస్య ఎక్కువగా ఉందని నీటి సమస్యను లేకుండా చేసేందుకు రూ.18 వందల కోట్ల వ్యయంతో జల్ జీవన్ మిషన్ ను ప్రారంభించారని, తద్వారా జిల్లాలో నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టారని తెలిపారు. ఇందులో మదనపల్లికి 450 కోట్లతో, పీలేరుకు 700 కోట్లతో, రాయచోటికి 400 కోట్లతో జమ్మలమడుగు వద్ద ఉన్నటువంటి గండికోట ప్రాజెక్టు నుండి నీటిని ఈ ప్రాంతానికి తీసుకురావడం జరుగుతున్నదని అన్నారు. ఇదే కాకుండా ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు కొరకు పెన్షన్ పెంపు, అన్నదాత సుఖీభవ వంటి ప్రజలకు ఉపయోగపడే పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. మదనపల్లి టమాటో మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారం చేయనున్న జలగం శివరాం గారికి, వైస్ చైర్మన్ ఆంజనేయులు,మార్కెట్ యార్డ్ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష మాట్లాడుతూ రైతులకు కాపాడుకునే బాధ్యత మనందరిది రైతు రారాజు రైతు ఉంటేనే సమాజంలో మనమందరము రైతు వాళ్ళ కష్టపడి పంట తీసుకొని వస్తే మనం కూర్చొని తినగలుగుతున్నామని తెలిపారు. ఈరోజు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరామ్, వైస్ చైర్మన్, సభ్యులకు మీపై ఒక సామాజిక బాధ్యత పనిచేయాలని అన్నారు. మదనపల్లి మార్కెట్ యార్డ్ మార్కెట్ యార్డ్ కి ఒక మహర్దశ రాబోతున్నదిని మొన్న నేను కువైట్ కి వెళ్ళాను కువైట్ లో వెళ్లి దాదాపు పల్ప్ యూనిట్ ఒక రోజుకి మినిమం 50 లోడ్లు పల్పు వాళ్లకి అవసరం ఉన్నదని ఒక పెద్ద కాంట్రాక్ట్ తీసుకొని రాబోతున్నామని తప్పకుండా రైతులకు ఒక మహర్దశ మారుతుందని అన్నారు. అలాగే 50 ఎకరాల స్థలం పూత బోలు దగ్గర రైతుకు కొత్త మార్కెట్ నిర్మించబోతున్నామని తెలియజేస్తున్నాము. మన ముఖ్యమంత్రి 75 సంవత్సరాలు వయసులో నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యల కోసం పని చేస్తున్నారు. పి జి ఆర్ ఎస్ ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కూటం ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా వ్యవసాయ శాఖ సెక్రెటరీ జగదీష్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలి చైర్మన్ గా జంగాల శివరాం, వైస్ చైర్మన్ గా రామిశెట్టి ఆంజనేయులు, ఇతర సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు సాయి లోకేష్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, తెలుగుదేశం రాష్ట్ర యువత అధ్యక్షులు చినబాబు, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్, టౌన్ బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్, కదిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ చౌదరి, మండి యజమానులు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీకీ కార్యకర్తలే అధినేతలు

### గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్

**గూడూరు సూర్య వాస్తవం నవంబర్ 13 :** గూడూరు నియోజక వర్గంలోని అన్ని మండలాలు, గ్రామాలలో వివిధ స్థాయిల్లో పదవులు పొందిన నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమం గూడూరు పట్టణం గమళ్లపాళెం లోని నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీలవారు పాల్గొన్నారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవం పండుగ వాతావరణంలో నిర్వహించారు. కొత్తగా నియమితుల్కెన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు తెలియజేశారు. పార్టీ సిద్ధాంతాలను కాపాడుతూ ప్రజలకు సేవ చేయాలన్న నిబద్ధతతో కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ వేడుకల్లో భాగంగా మొదట పార్టీ జెండా ఆవిష్కరించారు, ఎన్ టి ఆర్ విగ్రహం కు ఎమ్మెల్యే పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రమాణస్వీకారం అనంతరం కేక్ కటింగ్‌చేసి, సన్మానాలు చేసి, గ్రూప్ ఫోటోసెషన్‌లు,హోర్డింగ్‌లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన సభ లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీకి కష్టకాలంలో కష్టంచేసిన నాయకులు, కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.ఎన్నికలు ఉన్నా, లేకున్నా నిరంతరం ప్రజల్లో ఉందామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.. పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం వారం లో మూడు రోజులు అందుబాటులో ఉంటా ప్రతీ సోమవారం నుండి ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సమయం కేటాయిస్తా. ఏకాంతంగా మాట్లాడండి సమస్యలు తీసుకోని రండి పరిస్కారం చేస్తా.. మంచి పనులు కోసం రండి త్వరగా చేసి పంపిస్తాను అని ఎమ్మెల్యే చెప్పారు. ప్రతి నాయకుడు తన అధికారిక సోషల్ మీడియా పేజీలో వేడుకల ఫోటోలు, వీడియోలను షేర్ చేయాలని పిలుపునిచ్చారు.



## నేడు పెళ్లకూరులో ప్రజా సమస్యల పరిష్కారానికి "ప్రజా దర్బార్"



**పెళ్లకూరు, సూర్య వాస్తవం, నవంబర్ 13:** పెళ్లకూరు మండల ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు "ప్రజా దర్బార్" కార్యక్రమం నేడు శుక్రవారం ఘనంగా నిర్వహించబడనుంది. ఈ కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ గారు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ ప్రజలు తమ సమస్యలను, అభ్యర్థన పత్రాల రూపంలో నేరుగా ఎమ్మెల్యేకి అందజేయవచ్చు. ప్రజల అశయాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టడమే ఈ ప్రజా దర్బార్ ఉద్దేశ్యమని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను ప్రతిపాదించి, పరిష్కారానికి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు ప్రజలను కోరారు.

## గోరంట్ల విఆర్ఓల సంఘం నూతన కమిటీ ఏర్పాటు



**గోరంట్ల, సూర్య వాస్తవం, నవంబర్ 13:** గోరంట్ల మండల వీఆర్వోల సంఘం నూతన కమిటీని తాసిల్దార్ కార్యాలయం నందు ఏర్పాటు చేశారు, ఆంధ్ర ప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆదేశముల మేరకు గురువారం గోరంట్ల తహశీల్దార్ కార్యాలయం నందు గోరంట్ల మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు,మండల అధ్యక్షుడిగా పూలేరు విఆర్ ఓ కరణం నాగరాజ రావు, ఉపాధ్యక్షులుగా గోరంట్ల -5 వ సచివాలయం వి ఆర్ ఓ ఎం.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మల్లాపల్లి వి ఆర్ ఓ టి. పవన్ కుమార్, ట్రెజరర్ గా కొండాపురం వి ఆర్ ఓ సి. ప్రవీణ్ కుమార్ మరియు సంయుక్త కార్యదర్శి గా మలసముద్రం వి ఆర్ ఓ. బి. లక్ష్మీనరసమ్మ లను ఎన్నుకున్నారు, ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ మనోహర్,అశోక్ కుమార్,అనిల్ కుమార్,రంగనాథం,సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పఠాన్ రుబీనాకు ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయురాలిగా అవార్డు,పురస్కారం



**గోరంట్ల, సూర్య వాస్తవం, నవంబర్ 13:** భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జరుపుకునే జాతీయ విద్యా దినోత్సవం మరియు మైనారిటీ సంక్షేమ దినోత్సవం రోజున, జిల్లా కేంద్రం పుట్టపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల, గోరంట్ల ఉపాధ్యాయురాలు పఠాన్ రుబీనాకు ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయురాలిగా పురస్కారం లభించింది, ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు , ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు ఎస్.ఎం.సి కమిటీ ఛైర్మన్ ఆయేషా అజ్మతుల్లా ,సోషల్ అసిస్టెంట్ రుబీనా టీచర్ ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి, బహుమతులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో "రూటా" రాష్ట్ర నాయకులు ఫిరోజ్ అహ్మద్, ఉపాధ్యాయులు మసియిల్లా, ప్రతిభా భారతి, మహబూబ్ బాషా, ఆరిఫ్ అలీ, యాకూబ్, అల్లా బకష్, సుగుణమ్మ, రవీంద్ర నాయక్ పీ.డి.తదితరులు పాల్గొన్నారు.

# చట్టపరంగా పిల్లలను దత్తత తీసుకోవాలి




**గోరంట్ల, సూర్య వాస్తవం, నవంబర్ 13:** జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రమీల ఆదేశాల మేరకు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్ ఆదేశాల మేరకు గురువారం సోమందేపల్లి ప్రాజెక్ట్ గోరంట్ల మండల పరిధిలో ఉన్నటువంటి గుడిసెలలో నివసిస్తున్న ప్రజలకు ఐసిడిఎస్ సీడీపీఓ శాంత లక్ష్మి సూచనలతో సూపర్వైజర్ నాగరాణి అధ్యక్షతన కౌన్సిలర్ శివలత అంతర్జాతీయ దత్తతమాసం గురించి వివరించారు, ఇందులో చట్టపరమైన దత్తత గురించి మరియు పిల్లలు లేని దంపతులకి చట్టపరంగా పిల్లలను దత్తత తీసుకోవడం గురించి తెలియ జేశారు, అలాగే సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ గురించి మరియు స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ గురించి గ్రామ ప్రజలకు పిల్లలను దత్తత తీసుకునే తల్లిదండ్రులు శారీరకంగా, మానసికంగా మరియు భావోద్వేగపరంగా స్థిరంగా, ఆర్థికంగా స్థోమత కలిగి ఉండాలన్నారు, వారికి ఎటువంటి ప్రాణాంతకమైన వైద్య పరిస్థితి ఉండకూడదన్నారు, ఒంటరి మగ తల్లిదండ్రులు మగ బిడ్డను మాత్రమే దత్తత తీసుకోవచ్చన్నారు, ఒంటరి మహిళా తల్లిదండ్రులు ఏ లింగానికి చెందిన బిడ్డనైనా దత్తత తీసుకోవచ్చన్నారు, వివాహిత దంపతులు ఏ లింగానికి చెందిన బిడ్డనైనా దత్తత తీసుకోవచ్చన్నారు, వారికి ఇప్పటికే ఏ లింగానికి చెందిన బిడ్డ ఉన్నా లేకపోయినా దత్తత తీసుకోవచ్చన్నారు, పిల్లలను దత్తత తీసుకోవడానికి కావలసిన పత్రాలు దత్తత తీసుకునేవారి వ్యక్తిగత గుర్తింపు పత్రాలు, చిరునామా రుజువు, వివాహ ధృవీకరణ పత్రం (వివాహితులైతే), వైద్య ధృవీకరణ పత్రాలు, మరియు ఆదాయ రుజువు పత్రాలు అవగాహన కల్పించారు, నిరాదరణలో ఉన్నటువంటి పిల్లలను మరియు ముళ్ళ పొదల్లోని, చెత్తకుప్పలలోను పిల్లలను గుర్తించిన వెంటనే గ్రామ పరిధిలో ఉన్నటువంటి ప్రభుత్వ యంత్రాంగాలకి తెలియజేయాలని మరియు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి తెలియజేయాలని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి హేమావతి , ఏఎన్ఎం ఏఎన్ఎం, అంగన్వాడి టీచర్లు బిట్ర ప్రమీల , పద్మావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరమగ్గాల పై ఎన్ఫోర్స్మెంట్ అధికారుల బృందం దాడులు

## - 11 రకాల చీరలు తయారు చేస్తే మగ్గాలు సీజ్ చేస్తాం



**గోరంట్ల, సూర్య వాస్తవం, నవంబర్ 13:** చేనేత ఎన్ఫోర్స్మెంట్ అధికారుల బృందం గోరంట్ల పట్టణంలోని పవర్ లూమ్స్ చేనేత మగ్గాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు, చేనేత పరిశ్రమలో తయారు చేయాల్సిన 11 రకాల చీరల తయారీ డిజైన్ ఉత్పత్తులను మర మగ్గాల్లో తయారు చేస్తున్నారన్న వాటి పై కేంద్ర రాష్ట్ర చేనేత టెక్స్టైల్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల బృందం గురువారం గోరంట్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో గల కరెంటు మగ్గాల ఉత్పత్తులను తనిఖీ చేశారు, ఈ సందర్భంగా పట్టణంలోని చౌడేశ్వరి కాలనీ, శివాలయం కాలనీ తదితర ప్రాంతాల్లో కరెంటు మగ్గాలు తయారు చేస్తున్న చీరల ముడి సరుకును తనిఖీ చేస్తూ పరిశీలించారు, అనంతరం ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 11 రకాల చేనేత డిజైన్లను కరెంటు మగ్గాల్లో వాడడానికి వీలులేదని అందులో భాగంగానే జిల్లాలోని ధర్మవరం, ముద్ధి రెడ్డిపల్లి, సోమందేపల్లి, గోరంట్ల, లేపాక్షి తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా ధర్మవరంలో నిబంధనలకు విరుద్ధంగా చేనేత డిజైన్లను మర మగ్గాల్లో తయారు ఒక వ్యక్తి కి సంబంధించిన మగ్గాన్ని సీజ్ చేసినట్లు వారు తెలిపారు.

# కలసికట్టుగా పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

## - ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



**నాయుడుపేట సూర్య వాస్తవం నవంబర్ 13 :** తెలుగుదేశం పార్టీ క్లస్టర్,యూనిట్ ఇంచార్జ్ లు,బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులుగా నేడు ప్రమాణ స్వీకారం చేసిన అందరూ కలిసికట్టుగా పని చేసి, పార్టీ ప్రటిష్టతకు కృషి చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నేలవల విజయశ్రీ పిలుపు నిచ్చారు. గురువారం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగిన తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ క్లస్టర్,యూనిట్ ఇన్చార్జిలు,బూత్ కన్వీనర్లు,గ్రామ పార్టీ అధ్యక్షులు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.తొలుత ఎమ్మెల్యే స్థానిక టిడిపి నేతలతో కలిసి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు,మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్థాయిలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని తెలియజేశారు.గ్రామ స్థాయిలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలు నాయకులుగా ఎదుగుతారని తెలిపారు.కార్యకర్తలకు గౌరవప్రదమైన గుర్తింపునిస్తూ పార్టీ పదవుల నుంచి నియోజకవర్గ స్థాయిలో మంత్రి నారా లోకేష్ సూచన మేరకు ప్రమాణ స్వీకారం చేయించిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందన్నారు.పనిచేసే కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి కొండంత అండ అని అన్నారు.కూటమి పార్టీల గెలుపు తోపాటు తన కుమార్తె గెలుపుకు కృషి చేసిన కార్యకర్తలను ఎప్పటికీ మరచిపోబోమని తెలియజేశారు.కార్యకర్తల మాటే శిరోధార్యంగా భావించి పని చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు జడ్ శివప్రసాద్,తెలుగుదేశం పార్టీ నాయకులు,కట్టా వెంకట రమణారెడ్డి,నానబాల సుబ్బారావు, పసల గంగా ప్రసాద్,సంచి కృష్ణయ్య,విజయ్ కుమార్ నాయుడు,సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,శ్రీనివాసులు నాయుడు,పలుకూరు ముత్యాలయ్య,కాపులూరు చక్రపాణి మైలారి రాజశేఖర్, బల్లి ముత్యాలయ్య,చిట్టేటి చెంచయ్య, మండెం బాబు,చెందేటి సుజాత,సంపూర్ణమ్మ,తుపాకుల కన్నెమ్మ, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి సన్మానం

**నాయుడుపేట, సూర్య వాస్తవం, నవంబర్ 13 :**

సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం లను టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి సన్మానించారు.గురువారం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగిన సూళ్లూరుపేట నియోజకవర్గం క్లస్టర్,యూనిట్ ఇన్చార్జులు,బూత్ కన్వీనర్లు,గ్రామ పార్టీ అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం లకు తెలుగుదేశం పార్టీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కట్టా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం కుమార్తె ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సూళ్లూరుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులను సమన్వయపరిచి పార్టీ ప్రతిష్టతకు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని క్లస్టర్,యూనిట్ ఇన్చార్జులు, బూత్ కన్వీనర్లు గ్రామ పార్టీ అధ్యక్షులను ప్రమాణ స్వీకారం చేయించడం అభినందనీయమన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854